సాక్షి
వనపర్తి
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



వాలీబాల్ పోటీలు షురూ..

కోస్గిలో జాతీయస్థాయి అండర్‌–19 వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో



అలంపూర్ ఆలయాల అభివృద్ధి

అలంపూర్ ఆలయాలను ఆదివారం ప్రత్యేక బృందం సందర్శించింది.

వివరాలు 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.1 /19.5

చలి తీవ్రత రోజురోజుకు తగ్గుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం కావడంతో పాటు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘విద్యుత్’ ప్రైవేటీకరణ సరికాదు



వనపర్తి రూరల్: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను రద్దు చేస్తూ సంస్థలో పనిచేస్తున్న ఆర్టీజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని టీజీయూఈఈయూ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. ఆదివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయూఈఈయూ), టీజీఎస్‌పీడీసీఎల్ అధ్యక్షుడు చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో జరిగిన మహాసభలకు ఆయనతో పాటు సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి గోవర్ధన్ ముఖ్యఅతిథులుగా హాజరై కార్యాలయం ఎదుట సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 1999 తర్వాత నియమితులైన విద్యుత్ ఉద్యోగులందరికి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగులందరికీ అన్ లిమిటెడ్ మెడికల్ క్రెడిట్ కార్డు ఇవ్వాలని కోరారు. మహాసభల్లో పలు తీర్మానాలు చేశారు. అనంతరం టీజీఎస్‌పీడీసీఎల్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బస్వరాజు, సుధాకర్, ప్రసాద్, రాజు, సాంబయ్య, సురేశ్‌గౌడ్, రవీంద్రప్రసాద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి



వనపర్తిరూరల్: ప్రజాపాలనలో దరఖాస్తుల చేసుకున్న అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, గీత ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్‌కార్డులపై సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, ముందుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. లేకపోతే సన్న బియ్యం ఇచ్చినా కొద్దిమందికే ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే కార్డులు కలిగిన వారి కుటుంబాల్లో పిల్లలు పెద్దవారయ్యారని, వారి పేర్లను కార్డుల్లో చేర్చాలని ఎన్నో ఏళ్లుగా అడుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2,500 ఇవ్వాలని, మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. మహిళలు సంఘటితంగా గ్రామ కమిటీలను నిర్మించుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం పట్టణ కన్వీనర్ జయమ్మ, కోకన్వీనర్లు భూమిక, శిరీష, శ్రీదేవి పాల్గొన్నారు.

ఇదేం చోద్యం..!

బకాయిలు చెల్లించాలంటూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు



అమరచింత హౌసింగ్‌బోర్డుకాలనీలో ఇందిరమ్మ ఇల్లు

- అమరచింతలో 1982లో ఇళ్లు మంజూరు
- 125 మంది దళితులకు పంపిణీ
- నెలాఖరు గడువుతో చివరి నోటీసు అందిస్తున్న అధికారులు
- ఆందోళనలో పేద దళిత బీడీ కార్మికులు



పెచ్చులూడుతున్న పైకప్పు

అమరచింత: 1982లో అప్పటి ప్రభుత్వం ఇళ్లు లేని దళితుల కోసం అమరచింతలో ఇందిరమ్మకాలనీ పేరిట 9 ఎకరాల స్థలం కొనుగోలు చేసి 125 పేదలకు ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇచ్చిన ఇళ్లకు అప్పట్లో మార్టిగేజ్ చేయడంతో మిగిలిన మొత్తాన్ని చెల్లించాలంటూ రాష్ట్ర హౌసింగ్‌బోర్డు అధికారులు చివరి నోటీసులు అందజేస్తుండటంతో పేద బీడీ కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంతో తాము డబ్బులు చెల్లించలేమంటూ పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని.. తమకు న్యాయం చేయాలంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి విన్నవించుకుంటున్నారు. రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని.. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు భరోసానిచ్చి తమ ఇళ్లపై ఉన్న అప్పును పూర్తిగా మాఫీచేసి కుటుంబాలకు రక్షణ కల్పించాలని వేడుకోంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

1982లో అప్పటి ఎమ్మెల్యే వీరారెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కేవలం అమరచింతలో స్టేట్ హౌజింగ్‌బోర్డుతో పాటు కేంద్ర ప్రభుత్వ సాయంతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు నిర్ణయించారు. పట్టణంలోని మెటంబాయికి చెందిన 9 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి 125 ఇళ్లు నిర్మించి ఇందిరమ్మకాలనీ పేరుగా నామకరణం చేసి అప్పటి కేంద్ర మంత్రి మల్లికార్జున్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చిత్తరంజన్‌దాస్ చేతుల మీదుగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. వీరితో పాటు మాలలకు 25 ప్లాట్లను సైతం ఇచ్చారు. హైర్ పర్చేజ్ విధానంలో నిర్మించిన ఇళ్లను హౌసింగ్‌బోర్డు మార్టిగేజ్ చేసుకోవడంతో ఏడాదికి రూ.1,832 చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకొని ఇళ్లను అప్పగించామని అధికారులు అంటున్నారు. ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చిందని.. తమకు కంతులు చెల్లించాలనే నిబంధన అప్పట్లో చెప్పలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. 42 ఏళ్లకుగాను ఒక్కొక్కరు రూ.2,39,429 చెల్లించాలని ఫైనల్ నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. 1982లో నిర్మించిన ఇళ్లను 1985లో గ్రౌండింగ్ చేసి లబ్ధిదారులకు ప్రభుత్వం అప్పగించింది.

ఒక్కో ఇంటికి రూ.16,600..

అప్పట్లో ప్రతి ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.16,600, కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.1,500 రాష్ట్ర హౌసింగ్‌బోర్డుకు చెల్లించారు. అవిపోను మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారు ఏడాది రూ.1,832 చొప్పున 20 ఏళ్లు చెల్లించాల్సి ఉంది. కానీ కుటుంబ పోషణతో తల్లడిల్లుతున్న బీడీ కార్మికులు వాటిని చెల్లించలేకపోయారు. బకాయిలు పేరుకుపోవడంతో అధికారులు చివరి నోటీసులు అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

10.5 శాతం వడ్డీతో చెల్లించాలంటూ..

హైర్ పర్చేస్ విధానంలో ఇచ్చిన ఇళ్లకు ఏడాదికి 10.5 శాతం వడ్డీతో చెల్లించాలంటూ డాక్యుమెంట్లపై లబ్ధిదారులతో సంతకాలు చేసుకొని ఇళ్లను అప్పగించిన విషయం లబ్ధిదారులకు ఇప్పటికీ తెలియదు. ఏడాదికి రూ.1,832 చెల్లించాలని అప్పట్లో అధికారులు చెప్పినా.. వాటిని పూర్తిస్థాయిలో చెల్లించలేమని లబ్ధిదారులు ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చారు. అయినా ఇప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో అప్పు భారం తడిసి మోపెడైంది. బీడీ తయారీపై ఆధారపడి జీవిస్తున్న దళితులకు ప్రభుత్వమే బాసటగా ఉంటూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి కోసం చెల్లించే రూ.5 లక్షలు తమ ఇళ్లపై ఉన్న అప్పునకు చెల్లించాలని వేడుకోంటున్నారు.

చాలామంది నోటీసులు తీసుకోలేదు..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరచింతలో 1985లో హౌసింగ్‌బోర్డు ద్వారా నిర్మించిన ఇళ్లకు అప్పు చెల్లించాలంటూ నోటీసులు ఇస్తున్నాం. ఇదివరకే రెండు నోటీసులు జారీ చేశాం. చివరి నోటీసులు 125 మందికిగాను కేవలం 40 మంది మాత్రమే తీసుకున్నారు. మిగిలిన వారికీ అందిస్తున్నాం. నెలాఖరు నాటికి అప్పు చెల్లించాలని చెబుతున్నాం. ఒక్కో ఇంటి యజమాని రూ.2.39 లక్షలు చెల్లించాల్సి ఉంది.

– సంజీవరెడ్డి, ఏఈ, హౌసింగ్‌బోర్డు, మహబూబ్‌నగర్

ఇందిరమ్మ పేరిట ఉచితం అన్నారు..



అప్పట్లో నాకు యుక్త వయస్సు. కుటుంబం చిన్నదిగా ఉందని ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నా. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు అందిస్తుండటంతో తమకూ ఉచితంగా ఇంటిని మంజూరు చేసిందని అనుకున్నాం. కానీ ఇప్పుడు రూ.2.39 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం దయ తలచి తమకు న్యాయం చేయాలి.

– దాసు, లబ్ధిదారు, ఎస్సీకాలనీ

కూలేందుకు సిద్ధంగా ఉంది..



42 ఏళ్ల కిందట ఇందిరమ్మ పేరిట ఇల్లు ఇచ్చారు. ప్రస్తుతం ఆ ఇల్లు పెచ్చులూడుతోంది. బీడీలు తయారు చేసుకుంటూ అప్పుడప్పుడు మరమ్మతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు అప్పు కట్టమంటే ఎలా చెల్లించేది. పని దినాలు లేక కుటుంబ పోషణ భారమవుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మల్లమ్మ, లబ్ధిదారు, అమరచింత

అప్పగా అని చెప్పలేదు..



అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇచ్చిందనుకున్నాం. కానీ ఇన్నేళ్ల తర్వాత మీ ఇంటిపై అప్పు ఉందని.. చెల్లించాలంటూ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. అసలే పేదలం.. ఇందిరమ్మకాలనీ పేరిట నిర్మించిన హౌసింగ్‌బోర్డు కాలనీపై దయ చూపాలి.

– భాగ్యమ్మ, లబ్ధిదారు, అమరచింత

ప్రభుత్వమే ఆదుకోవాలి..



అప్పుడెప్పుడో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లపై ఉన్న బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలి. 125 ఇళ్లలో నివసిస్తున్న ప్రతిఒక్కరూ బీడీల తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు. నెలకు కేవలం 15 రోజుల పనిదినాలు ఉండటం.. చాలీచాలని వేతనాలతో పూట గడవని పరిస్థితుల్లో ఉన్నారు. పెచ్చులూడుతున్న ఇళ్లకు మరమ్మతులు చేసుకునేందుకు అప్పు చేస్తున్న పరిస్థితులు వారివి.

– బుచ్చన్న, జిల్లా అధ్యక్షుడు, బీడీ కార్మిక సంఘం, అమరచింత



నోటీసు చూపుతున్న లబ్ధిదారులు

అట్టహాసంగా ఆర్‌ఎల్‌డీసీ స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, జస్టిస్ డి.నాగార్జున, బాలకృష్ణారెడ్డి తదితరులు

- హాజరైన ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు



అధ్యాకురాలిని సన్మానిస్తున్న చిన్నారెడ్డి, నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్/వనపర్తి విద్యావిభాగం: జిల్లాకేంద్రంలోని రాణి లక్ష్మీదేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్‌ఎల్‌డీసీ) స్వర్ణోత్సవాలను ఆదివారం జిల్లాకేంద్రంలో పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పూర్వ విద్యార్థులు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, పూర్వపు ఆర్జేడీ రాజేందర్‌సింగ్, గద్వాల అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి కళాశాలలో చదువుకున్న విద్యార్థులు హాజరయ్యారు. కుటుంబ స్థితిగతులు, మంచి చెడులను ఒకరికొకరు పంచుకుంటూ సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవ సంబురం అందరిలో ఆనందోత్సవాలను నింపింది. అధ్యాపకులు, కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులను, అతిథులను స్వర్ణోత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

విలువల విద్యకు చిరునామా..

సమకాలిన అంశాలను పాఠ్యాంశాలకు అనుసంధానం చేసి విద్యార్థులకు బోధించడం వనపర్తి ప్రాంత ప్రత్యేకతని తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పూర్వపు ఆర్జేడీ రాజేందర్‌సింగ్ అన్నారు. విలువలతో కూడిన విద్యను అందించడంతోనే జీవితంలో ఉన్నతస్థాయిలో ఉండగలిగామని, హోదా ఎంత పెరిగినా ఇక్కడ వేసిన పునాదే బలమైన కారణమని పేర్కొన్నారు. దేశ విదేశాల్లో ఎక్కడ చదివినా ఇక్కడి విద్యకు సరిసమానంగా అనిపించలేదని తెలిపారు.

భవిష్యత్ తరాలకు స్ఫూర్తి..

కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. చదివిన కళాశాలపై మక్కువతో అభివృద్ధికి పాటుపడేందుకు చొరవచూపడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడారు.

అభివృద్ధికి విభేదాలు ఉండవు..

పార్టీ సిద్ధాంతాల పరంగా విభేదాలున్నా.. వనపర్తి అభివృద్ధి విషయంలో తమకు ఎప్పుడు విభేదాలు ఉండవని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించడంతో సభలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. వనపర్తిని విద్యపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం తపిస్తుంటానని, గత ప్రభుత్వంలో మిగిలిన పనులంటిని పూర్తి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చిన్నారెడ్డి వెల్లడించారు. తన హయాంలో విద్యారంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు. మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం విద్యలో వనపర్తిని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేశానన్నారు. కీర్తి కోసం కాకుండా శాశ్వత అభివృద్ధికి బాటలు వేశానని వివరించారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

వనపర్తి అనుబంధం మరువలేనిది..



1979 నుంచి 1982 వరకు ఈ కళాశాలలో చదువుకున్నాను. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి అధ్యాపకులు బోధించిన తీరుతోనే ఉన్నతంగా ఎదిగాం. తాను డాక్టరేట్ పొందినా, అమెరికాలో విద్యనభ్యసించినా ఇక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్యలో ఉండే అనుంబంధం ఎక్కడ కనిపించలేదు. ఇక్కడ విద్యను అభ్యసించడం ఎనలేని అనుబంధాన్ని మిగిల్చింది.

– జస్టిస్ నాగార్జున, చైర్మన్ తెలంగాణ ఎలక్ట్రి సిటీ రెగ్యులేటరీ కమిషన్

విద్యాపర్తిగా గుర్తింపు..



విద్యాపరంగా వనపర్తికి పూర్వం నుంచే మంచి గుర్తింపు ఉంది. నాటి ఉపాధ్యాయులు ఆ గుర్తింపునకు అనుగుణంగా మమ్మల్ని తీర్చిదిద్దడంతో జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించగలిగాం. విలువలు, క్రమశిక్షణతో బోధన అందించారు. ఇక్కడి ఉపాధ్యాయులు స్ఫూర్తివంతంగా, ఆదర్శప్రాయులుగా నిలిచారు. వనపర్తిలో పడిన పునాదులతోనే జీవితంలో ఉన్నతంగా ఎదిగాం.

– లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్, గద్వాల

ఆనందంగా ఉంది..



కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉంది. ఆడపిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు అప్పట్లో చిన్నారెడ్డి విశేషంగా కృషి చేశారు. మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో ఎందరో అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు 30 ఏళ్ల కిందట వనపర్తిలో అడుగులు పడ్డాయి. పాలమూరులో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంతో మహిళల అక్షరాస్యత పెంచేందుకు దోహదపడుతుంది. ఇక్కడ చదువుకొని రచయితలుగా, కవయిత్రులుగా, కళాకారులుగా రాణించడం ఈ ప్రాంతం కల్పించిన గొప్ప అవకాశం.

– యశోద, సీనియర్ జర్నలిస్ట్

కొలిక్కి వచ్చినట్లేనా..!?

శ్రీధర్‌రెడ్డి హత్యకేసులో తుదిదశకు పోలీసుల దర్యాప్తు

- సాంకేతిక ఆధారాల సేకరణలో అధికారులు



హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2024, మే 23న చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన విషయం విధితమే. ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో)లో నమోదైన ఈ కేసు దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారింది. తెలివిగా ఎలాంటి ఆధారాలు లేకుండా చేసిన హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సీఐడీ డీజీ శిఖాగోయల్ నేషనల్ ఫోరెన్సిక్ ల్యాబ్ టెక్నీషియన్లను గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి రప్పించి సాంకేతిక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ స్వయంగా గ్రామాన్ని సందర్శించి విచారణ ముమ్మరం చేశారు. సుమా రు 52 మందికి పైగా అనుమానస్తులను విచారించి కొన్ని ఆధారాలు సేకరించినట్లు సమాచారం.

లైవ్ డిటెక్టర్, పాలిగ్రాఫ్ టెస్టులకు సమాయత్తం..

హత్య జరిగిన రోజు నిందితులు సెల్‌ఫోన్లు తీసుకువెళ్లకుండా జాగ్రత్త పడినట్లు పోలీసుశాఖలో చర్చ వినిపిస్తోంది. దీంతో అనుమానం ఉన్న వ్యక్తులపై లైవ్ డిటెక్టర్, పాలిగ్రాఫ్ టెస్టులు చేసేందుకు ఉన్నతాధికారులు కోర్టు నుంచి అనుమతి తీసుకున్నట్లు పోలీసువర్గాలు వెల్లడించగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆధిపత్య పోరు, వివాహేతర సంబంధం కోణంలోనూ..

హత్యకేసు విచారణ రాజకీయ ఆధిపత్య పోరు, వివాహేతర సంబంధం కోణాల్లో దర్యాప్తు ము మ్మరం చేస్తున్నట్లు పోలీస్ అధికారుల ద్వారా తెలుస్తోంది. రాజకీయ ఆధిపత్య పోరే హత్యకు కారణమనే వాదనలు జిల్లాలో, రాజకీయ పార్టీ శ్రేణుల్లో బలంగా వినిపిస్తున్నాయి. నిజానిజాలు ఏమిటనే విషయాన్ని పోలీసు అధికారులు ఆధారాలతో నిరూపించాల్సి ఉంది.

ఆధారాలతో వెల్లడిస్తాం..



ఎస్పీ రావుల గిరిధర్ తన విధి నిర్వాహణలో 40 శాతం సమయం కేసు విచారణకు వినియోగిస్తున్నారు. రోజువారీగా పురోగతిని అడుగుతున్నాం. ఇప్పటికే 95 శాతం దర్యాప్తు పూర్తయింది. వైద్యుల సమక్షంలో చేయాల్సిన పరీక్షల కోసం నిపుణుల సాయం తీసుకుంటున్నాం. హత్య కేసుతో సంబంధం ఉన్న వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదు. త్వరలో పూర్తి వివరాలు ఆధారాలతో వెల్లడిస్తాం.

– సత్యనారాయణ, మల్టీజోన్–2 ఐజీ

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ డా. మల్లు రవి, చిత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తదితరులు

వనపర్తి: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని.. వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని.. పౌరుల హక్కులు, స్వేచ్ఛను అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించారని గుర్తుచేశారు. పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానాన్ని దేశ ప్రజలందరూ గమనించారని.. ప్రజాస్వామ్యంపై దాడి చేసే ప్రయత్నం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ఎంపీలు, ఇండియా కూటమి నేతలు పార్లమెంటులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేయడంతో పాటు అమిత్‌షా రాజీనామాకు డిమాండ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు, మద్దతు పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించినట్లు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నాయకులు లక్కాకుల సతీష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ పాల్గొన్నారు.

చిన్నరాజమూర్‌లో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి కనిపించింది. వారం రోజులుగా స్వామివారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి దాసంగాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఆవులు, కోడె దూడలను సమర్పించారు. ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెట్టారు. గండజ్యోతులతో ప్రదక్షిణలు చేశారు. జాతరలో వెలసిన మిఠాయి, గాజులు, ఆటబొమ్మల దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. మరో వారంపాటు జాతర కొనసాగనుంది.

క్లుప్తంగా

నీటికుంటలో పడి రైతు మృతి

బిజినేపల్లి : మోటారు మరమ్మతుల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి కృష్ణయ్య(45) అనే రైతు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బిజినేపల్లికి చెందిన కృష్ణయ్య తన పొలానికి నీరు పారించే మోటారు మొరాయించడంతో మరమ్మతు చేయడానికి ఈదులకుంటలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగిపోయాడు. కుటుంబీకులు కాపాడే ప్రయత్నం చేసినా అతడు నీటిలో మునిగి మరణించాడు. కుటుంబసభ్యులు బోరున విలపించారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి దుర్మరణం


కొండారెడ్డి (ఫైల్)

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనగా ఓ వ్యక్తి చెందగా మరో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. వివరాలు.. పెద్దకార్పాములకి చెందిన బండారు కొండారెడ్డి(50) ఆదివారం రాత్రి స్కూటీపై పొలానికి బయలుదేరాడు. చిన్నకార్పాముల నుంచి రాఘవేంద్ర, రాకేష్ అనే యువకులు మోటార్ సైకిల్‌పై వేగంగా వచ్చి కొండారెడ్డి స్కూటీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో స్కూటీ పైనుంచి కిందపడ్డ కొండారెడ్డి అక్కడికక్కడే మరణించాడు. రాఘవేంద్రకు తీవ్ర గాయాలు కాగా 108లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య రేణుకతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుమందు తాగి యువకుడి బలవన్మరణం


గణేష్ (ఫైల్)

ఉప్పునుంతల: మండలంలోని పూర్యానాయక్‌తండాలో శనివారం రాత్రి రామావత్ గణేష్(24) అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు.. పూర్యానాయక్‌తండాకు చెందిన రామావత్ సూర్య, లక్ష్మిల రెండో కుమారుడు గణేష్. తల్లిదండ్రులతో కలిసి శనివారం సాయంత్రం వరకు వ్యవసాయ పొలంలోనే పనిచేశాడు. పశువులను కట్టి వస్తానని పొలంలోనే ఉన్నాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లి చూశారు. పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. కుటుంబ సభ్యులు అచ్చంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడు. యువకుడి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామానికి చెందిన కావలి వెంకటేశ్ (33) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం రాత్రి సమయంలో పొలం దగ్గరకు వెళ్లి చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లాడు. తిరిగి ఉదయం వరకు రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు పొలం వద్ద, చెరువులో వెతికారు. అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ దాంధీనాయక్ డాగ్‌స్క్వాడ్‌తో వచ్చి వివరాలు సేకరించినా ఫలితం లేకపోయింది. చివరకు ఆదివారం రాత్రి తన స్నేహితుని సూచన మేరకు గ్రామస్తులు, యువకులు మల్కచెరువులో వెతుకగా వెంకటేశ్ మృతదేహం లభించింది. వెంకటేశ్ శరీరంపై పంటపొలంలో విద్యుత్‌షాక్ తగిలిన గాయాలు ఉన్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేశారు. వెంకటేశ్‌కు తల్లి సాయమ్మ, భార్య సువర్ణ, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

గుప్త నిధుల కోసం ఇంట్లో తవ్వకాలు



మరికల్: ఎవరూ లేని సమయంలో కొందరు దుండగులు గుప్త నిధుల కోసం ఓ ఇంట్లో తవ్వకాలు జరిపారు. ఈఘటన ఆదివారం రాకొండలో వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. రాకొండకు చెందిన రెడ్డి సువర్ణ ఈనెల 11న కుమారుడికి పెళ్లి చేసింది. రెండు రోజుల క్రితం అతడు అత్తారింటికి వెళ్లాడు. తల్లి ఊళ్లో ఉన్న మరో ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో వారి పొలంలో ఉన్న ఇంట్లో రెండు రోజుల నుంచి రాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం పెద్ద గొయ్యిని తవ్వి మట్టిని బయటకు ఎత్తిపోశారు. ఈవిషయాన్ని గ్రామస్తులు గమనించి ఆఇంటి కుటుంబసభ్యులకు తెలిపారు. వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సామగ్రిని చెల్లాచెదురుగా పడేసి తవ్వకానికి వాడిన వస్తువులను అక్కడే వదిలి వెళ్లారు. ఈవిషయంపై రెడ్డి సువర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహారాష్ట్ర పార్థీ గ్యాంగ్ పనే..


వివరాలు వెల్లడిస్తున్న మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ.. చిత్రంలో ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ, సీఐలు

పెబ్బేరు దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- అదుపులో నలుగురు నిందితులు.. ఇద్దరు పరారీ
- 6.5 తులాల బంగారం, 3 సెల్‌ఫోన్లు, 2 బైకులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ

వనపర్తి: నేరస్తులు ఎంత తెలివిగా వ్యవహరించినా.. చిన్న పొరపాట్లతో పట్టుబడక తప్పదు. ఈ నెల 18 తెల్లవారుజామున పెబ్బేరు శివారు 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన దారి దోపిడీ కేసును చిన్నపాటి క్లూతో ఛేదించి దోపిడీకి పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావుతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. దారి దోపిడీకి పాల్పడింది మహారాష్ట్ర పార్థీ గ్యాంగ్‌గా చెప్పారు. మహారాష్ట్రకు చెందిన బద్రీగజానన్ పింపలే, సయ్యద్ ఫిరోజ్ మెహతాబ్ ఇటిక్యాల మండలంలోని చెరుకు రైతుల వద్ద ట్రాక్టర్ డ్రైవర్లుగా పని చేస్తూ కొత్తకోటలోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకుని తరలిస్తుంటారు. ఈ నెల 18 తెల్లవారుజామున వీరిద్దరు తమ ట్రాక్టర్లను పెబ్బేరు శివారులో నిలిపి ఉంచారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూరుకు చెందిన జి.రజని కుటుంబం తిరుపతికి వెళ్లి వస్తూ.. ట్రాక్టర్లు ఉండటం చూసి భద్రత కోసం తమ వాహనాన్ని కూడా పక్కకు నిలిపి నిద్రకు ఉపక్రమించారు. దీన్ని గమనించిన ఇద్దరు డ్రైవర్లు సమీపంలో ఉన్న మిగతా గ్యాంగ్ సభ్యులకు సమాచారం ఇచ్చి వారితో కలిసి దోపిడీకి పాల్పడ్డారు. మొదట వాహనంపై ఉన్న సామగ్రిని ఎత్తుకెళ్లగా అందులో విలువైన వస్తువులు లేకపోవడంతో తిరిగి రాళ్లు, కత్తులు, కర్రలతో వాహనం నాలుగు వైపుల నుంచి దాడి చేసి మహిళల మెడల్లో ఉన్న బంగారు ఆభరణాలు దోచుకున్నారు. కారు తాళం చెవి కూడా తీసుకెళ్తుండగా.. గాయపడిన డ్రైవర్ సంతోష్ 'కీ' ఇవ్వాలంటూ వారి వెంటపడ్డాడు. ఇంత పెద్ద ఘటన జరిగినా స్పందించకుండా నిద్రిస్తున్నట్లు నటిస్తున్న బద్రీగజానన్ పింపలే, సయ్యద్ ఫిరోజ్ మెహతాబ్ తాళం చెవి ఇవ్వాలంటూ వారికి సైగ చేశారు. దీన్ని గమనించిన సంతోష్, కారులో ఉన్న ఓ బాలుడు విషయాన్ని పోలీసులకు వివరించారు. ఈ కోణంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటన స్థలంలో సేకరించిన వేలిముద్రలు నిందితుల్లో ఒకరైన బద్రీకి సరిపోలడంతో ఐదు బృందాలను ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేశారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నలుగురు నిందితులు బద్రీ, శ్రీరాంశివాజి, సచిన్ సంతోష్, సయ్యద్ ఫెరోజ్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి 6.5 తులాల బంగారంతో పాటు మూడు సెల్‌ఫోన్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పని కోసం ఇక్కడికి వచ్చిన పార్థీ గ్యాంగ్‌లోని కొందరు తమ వారిని రప్పించుకొని దోపిడీకి పాల్పడినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు సంతోష్ పాండురంగకలే, సంజయ్ పవార్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

చిరుత దాడిలో మేక మృతి

మద్దూరు: చిరుత దాడిలో మేక మృతిచెందిన ఘటన మండలంలోని నందిపాడు గుట్టల్లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొంగు మహిపాల్ శనివారం సాయంత్రం తన పొలం దగ్గర మేకలను కట్టివేసి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా మేక మృతిచెంది కనిపించింది. చిరుత దాడితోనే మేక మృతి చెందినట్లు పేర్కొన్నారు. రెండు నెలల్లో సుమారు 10 మూగజీవాలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్ వద్ద ప్రస్తావించగా నందిపాడ్ గుట్టల్లో చిరుత సంచారిస్తున్న మాట వాస్తవమేనన్నారు. చిరుతను పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

అడవి జంతువు దాడిలో లేగదూడ..

వెల్దండ: చెర్కూర్‌లో రైతు దాసరి రమేష్ ఆవుదూడపై శనివారం రాత్రి అడవి జంతువు దాడి చేయడంతో మృతిచెందింది. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా మృతిచెంది కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బీట్ అధికారి లలిత ఘటన స్థలాన్ని పరిశీలించి పాద ముద్రలను సేకరించారు.

చౌడేశ్వరీ ఆలయంలో చోరీ

బిజినేపల్లి : మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన చౌడేశ్వరీ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు.అమ్మవారి వెండి, బంగారు ఆభరణాలు దొంగిలించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి వెండి కిరీటాలు, ఇతర బంగారు, వెండి ఆభరణాలు, పట్టుచీరలు గర్భగుడిలోనే భద్రపరిచారు. గుర్తుతెలియని దుండగులు ఆలయం తలుపులు బద్దలు కొట్టి చోరీ చేశారు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన కొందరు విషయం గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలకు చెందిన అచ్యుతారెడ్డి(35) చాలారోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన ఈనెల 7వ తేదీన వ్యవసాయ పొలం వద్ద పురుగుమందు తాగాడు. అనంతరం కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చాడు. వారు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధురానగర్ కాలనీలో మరో వ్యక్తి...


ముత్యాలు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని మధురానగర్ కాలనీకి చెందిన ముత్యాలు(40) జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి భార్య అప్పులు చేయడంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉలిక్కిపడిన పాతబజార్


జడ్చర్ల పాతబజార్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఉదయం కార్డెన్ సెర్చ్
- సరైన పత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలు, 1 ఆటో, 1 కారు స్వాధీనం
- భద్రత పెంపొందించటం కోసమే కార్డెన్ సెర్చ్ : అడిషనల్ ఎస్పీ


పాతబజార్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పట్టణం పాతబజార్ ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పీఏసీఎస్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఒక్కసారిగా ఆందోళన, అయోమయానికి గురయ్యారు. సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలు, 1 ఆటో, 1 కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ రాములు ఆధ్వర్యంలో జరిగిన సెర్చ్ పూర్తి వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ ప్రాంతవాసులు ఆదివారం తెల్లవారుజామున కార్యకలాపాలకోసం నిద్రనుంచి లేస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా పోలీసుల వాహనాలు వచ్చి నిలిచాయి. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, నలుగురు సీఐలు 20మంది ఎస్ఐలు, 70కిపైగా కానిస్టేబుళ్లు మొత్తం 100మంది వరకు సిబ్బంది వచ్చి అక్కడ ఆగారు. ప్రాంతంలోని ప్రతి ఇంటిని తట్టి లేపారు. పడుకుని ఉన్న వారిని లేపటంతో మొదట ఎవరు పిలుస్తున్నది అర్థం కాక, తేరుకుని పోలీసులను చూసి ఒక్కసారిగా విస్తూపోయారు. తరువాత వాళ్లు అడిగిన సమాచారం ఇచ్చారు. వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, కారు, ఆటోలను పాతబస్టాండ్ ప్రాంగణానికి తీసుకురమ్మని ఆదేశించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఆ ప్రాంత వాసులతో పోలీసులు మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

33 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటో స్వాధీనం

పోలీసులు చేసిన సోదాలు, తనిఖీలో మొత్తం 33 ద్విచక్రవాహనాలు, 1 ఆటో, 1 కారుకు సరైన పత్రాలు లేవని గుర్తించారు. వాటిని స్వాధీన పర్చుకుని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగితాలు తీసుకొచ్చి వాహనాలు తీసుకెళ్లాలని వాహనదారులకు సూచించారు.

భద్రతను పెంపొందించటం కోసమే..

సమాజంలో భద్రతను పెంపొందించటం కోసం కమ్యూనిటీ కనెక్ట్‌లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించాం. పోలీసుశాఖ ప్రజలకు చేరువయ్యే దిశగా, నేరాల నివారణకు ఈ తరహా తనిఖీలు అవసరం. అందుకు ప్రజలు సహకరించాలి. న్యాయ, సరైన పత్రాలు, రవాణా నిబంధనలు పాటించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది. కార్యక్రమం ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు నేర ప్రవృత్తిని అదుపులో ఉంచటానికి సహాయ పడుతుంది.

– రాములు, అడిషనల్ ఎస్పీ, మహబూబ్‌నగర్

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. బ్యాంక్ ఖాతా వివరాలకోసం వచ్చే కాల్స్, ఈ మెయిల్స్‌కు స్పందించవద్దు. ఏ బ్యాంకు సిబ్బంది కార్డు నెంబరు, పిన్, ఓటీపీ, సీవీవీ వివరాలు అడగరని గుర్తుంచుకోవాలి. ఎవరైనా అడిగితే వారు సైబర్ నేరగాళ్లని గుర్తించాలి. బ్యాంకు రేటుకంటే తక్కువ రేటుకు రుణాలు ఇస్తామంటే వారిని సందేహించాలి. అత్యవసర సమయంలో 100 నెంబరు సమాచారం అందించాలి.

– రమణారెడ్డి, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు ఆలోచించాలి

పోలేపల్లిలో ఫార్మసెజ్ కారణంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు జడ్చర్లలో నివాసం ఉంటున్నారు. కొందరు ఇండ్లను అద్దెకు తీసుకుని కొన్ని రోజులు ఉండి రావటం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. వాటి విషయంలో ముందే జాగ్రత్త పడి ఎక్కడ పనిచేస్తారు అనే వివరాలు తెలుసుకుని అద్దెకు ఇవ్వాలి. ఇంటి పక్కన ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు సాధారణ వివరాలు తెలుసుకోవాలి. రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలి. హైవేపై రోడ్డు చివర ఉండే 5 అడుగుల లైన్ లోపలే వెళ్లాలి, తద్వారా ప్రమాదాలు నియంత్రించవచ్చు.

– ఆదిరెడ్డి, సీఐ, జడ్చర్ల

శోకసంద్రంలో పోమాల్



నవాబుపేట: ఊరు ఊరంతా బోరున విలపిస్తూ చిన్నారులను ఒకపక్క ఓదారుస్తూ మరో పక్క చెరువు మింగిన చిన్నారులను కడసారి చూస్తూ గ్రామం మొత్తం రోదించింది. శనివారం గ్రామానికి చెందిన కుక్కింద సరోజ(28), దివ్య(6), అక్షయకుమార్ (5) ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటమునిగి చెరువులో మృతిచెందారు. దీంతో ముగ్గురి అంత్యక్రియలు ఒకేసారి ఆదివారం నిర్వహించారు. ఒకే ఇంటి ముందు మూడు మృతదేహాలు అన్నింటికి ముందు నడుస్తూ సరోజ భర్త, చిన్న కుమారుడు వారి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో గ్రామం మొత్తం రోదనలతో నిండిపోయింది.

ఆరుగురిని మింగిన చెరువు

పోమాల్ పెద్ద చెరువు అంటేనే ఆ చుట్టుపక్కల గ్రామాలకు బయం. అందులో పడ్డారంటే చావుతప్పనిసరి అంటూ అక్కడి జనం పెదబొబ్బలు పెడుతున్నారు. గతంలో సైతం ముగ్గురు వ్యక్తులు వివిధ సందర్భాల్లో చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లి ఇద్దరు, పశువులకు నీటిని తాగించేందుకు వెళ్లి మరొకరు చెరువులో పడి మృతి చెందిన సంఘటనలు గతంలో చోటు చేసుకోగా, తాజాగా తల్లి ఇద్దరు చిన్నారులను చెరువు మింగేసింది.

అంతర్జాతీయస్థాయిలో రాణించాలి


మాట్లాడుతున్న శిక్షణ కలెక్టర్ నీలిమా గరుల.. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన శిక్షణ కలెక్టర్


పోటీ పడుతున్న క్రీడాకారులు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కోస్గి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎం కప్ పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని శిక్షణ కలెక్టర్ నీలిమా గరుల, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ 68వ జాతీయస్థాయి అండర్–19 బాలుర వాలీబాల్ పోటీలను పుర చైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల ఆవశ్యకతను గ్రామీణ క్రీడాకారులు గుర్తించాలనే జాతీయస్థాయి పోటీలను సీఎం ఇలాఖాలో నిర్వహిస్తున్నామన్నారు. 21 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాలు, 7 కేంద్ర పాఠశాలల జట్లతో 400 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరైనట్లు నిర్వాహకులు వివరించారు. అంతకుముందు వివిధ రాష్ట్రాల జట్లు మైదానంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి, డీవైఎస్‌ఓ వెంకటేశ్‌శెట్టి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్, అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాపిరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్లు బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు బెజ్జు రాములు, కోడిగంటి హరి, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీనివాస్, ఇద్రీస్, భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి చర్యలు

- సందర్శించిన ప్రత్యేక బృందం


వివరాలు నమోదు చేసుకుంటున్న ప్రత్యేక బృందం సభ్యులు

అలంపూర్: అలంపూర్ ఆలయాల అభివృద్ధికిగాను ఆదివారం ప్రత్యేక బృందం సభ్యులు ఆర్కిటెక్చర్ సత్యనారాయణమూర్తి, దేవాదాయశాఖ కార్యదర్శి తులసి తదితరులు సందర్శించినట్లు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఆర్‌జేసీ రామకృష్ణారావు తనతో చర్చించినట్లు వివరించారు. రహదారులు, ఆలయ భూములు, ప్రసాద్ స్కీం భవనం పరిశీలించారని.. జాతీయ రహదారిని అనుసరించి ఉన్న భూములను పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపార సముదాయలకు లీజుకు ఇవ్వడం వంటి అంశాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. స్వాగత తోరణం, పబ్లిక్ ఇమ్యూనిటీ సెంటర్, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ చంద్రయ్య ఆచారి తదితరులు ఉన్నారు.

బస్సు ప్రమాదంలో 200 గొర్రెలు మృతి

- ఇద్దరు కాపరులకు గాయాలు


ఘటన స్థలంలో మృతిచెందిన గొర్రెలు

నారాయణపేట: ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రంలో బస్సు ప్రమాదంలో 200 గొర్రెలు మృతిచెందగా.. ఇద్దరు గొర్రెల కాపరులు గాయపడ్డారు. వివరాలు.. నారాయణపేట జిల్లాలోని కొల్లంపల్లి, ధన్వాడ గ్రామాలకు చెందిన ఆవుల మల్లేష్, కర్రెప్ప తమ గొర్రెలను తీసుకెళ్లి ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లిలో మేపుతున్నారు. ఆదివారం ఉదయం గొర్రెలను రోడ్డు దాటిస్తుండగా ఓ బస్సు హఠాత్తుగా గొర్రెల పైకి వచ్చింది. దీంతో దాదాపు 200 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. గొర్రెల కాపరులకు గాయాలు కాగా చికిత్సకోసం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం జిల్లా కన్వీనర్ పిడుగు కన్నప్ప గాయపడ్డవారితో ఫోన్‌లో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం ప్రతి గొర్రెకు రూ.20వేలు పరిహారమివ్వాలని కోరారు. ప్రమాదానికి కారణమైన బస్సు యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇప్పటికైనా గొర్రెల కాపరులకు బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

జూరాలకు స్వల్పంగా వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 2,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి 1,340 క్యూసెక్కులకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 90 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 200 క్యూసెక్కులు, కుడి కాల్వకు 400 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 750 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 1,340 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 8.280 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 5,195 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 5,195 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,630, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంకజీకేఏల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.198 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఆదివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.6 అడుగుల వద్ద 114.2356 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

వలకు చిక్కిన భారీ కొండచిలువ



కోడేరు: మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ నీటిని విడుదల చేసే ప్రధాన గేట్ల వద్ద అదే కంపెనీలో పని చేస్తున్న వారు ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపల వలలో భారీ కొండ చిలువ పడింది. దీన్ని గమనించి జాలర్లు వలను బయటకు తీసి కొండచిలువను రాళ్లతో కట్టి బయటకు తీసి అడవిలో వదిలేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు యువకులు భయాందోళనకు గురయ్యారు.